తెలంగాణ
# వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

తెలంగాణ వెన్నెల వాక్కు
**విలేకరులు కావలెను**
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :10 25-07- 2026 శనివారం పేజీలు: 4 వెల:03/-

# విద్యాసంస్థల్లో డ్రగ్స్ ఘటనలకు యాజమాన్యాలదే బాధ్యత

### మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చట్టాలపై అధ్యయనం.. టోల్‌ఫ్రీ, క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని ఆదేశం



హైదరాబాద్, జూలై 24:
రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థల ప్రాంగణంలో డ్రగ్స్‌కు సంబంధించిన ఘటనలు జరిగితే ఆయా విద్యాసంస్థల యాజమాన్యాలను కూడా బాధ్యులను చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే దీనికి సంబంధించిన ప్రత్యేక చట్టం తీసుకురావడంపై అధ్యయనం చేయాలని అధికారులకు చెప్పారు.
మాదకద్రవ్యాల నియంత్రణ, భద్రత కమిటీల పనితీరుపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో పోలీసు ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనను అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటున్న ప్రభుత్వం, ఈ సమస్యను అరికట్టేందుకు అన్ని శాఖల సమన్వయంతో కఠిన చర్యలు అమలు చేయాలని స్పష్టం చేశారు.
విద్యాసంస్థల క్యాంపస్‌లలో మాత్రమే కాకుండా, వాటి పరిసర ప్రాంతాల్లో జరిగే డ్రగ్స్ కార్యకలాపాలపై కూడా నిఘా ఉండాలని సీఎం సూచించారు. క్యాంపస్ వెలుపల జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు.
డ్రగ్స్ నియంత్రణలో విద్యాసంస్థలకు అధికారాలతో పాటు బాధ్యతలు కూడా ఉండాలని పేర్కొన్న సీఎం, విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను ముందుగానే గుర్తించేలా ప్రతి విద్యాసంస్థలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో అవగాహన పెంచడంతో పాటు తల్లిదండ్రులతోనూ నిరంతరం సమన్వయం కొనసాగించాలని తెలిపారు.
డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు ప్రతి విద్యాసంస్థలో టోల్‌ఫ్రీ నంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు గోప్యంగా 2

# 26 రోజుల నిరాహార దీక్ష విరమించిన సోనమ్ వాంగ్చుక్

### పరీక్షల సంస్కరణలపై కేంద్రం రాతపూర్వక హామీ -- పేపర్ లీక్ నిరోధక బిల్లు తెస్తామని ప్రధాని




న్యూఢిల్లీ, జూలై 24:
నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనంపై కేంద్ర ప్రభుత్వం రాతపూర్వక హామీ ఇవ్వడంతో ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ తన 26 రోజుల నిరాహార దీక్షను విరమించారు. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ సమక్షంలో ఆయన దీక్షను ముగించారు.
ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, సోనమ్ వాంగ్చుక్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. దేశ యువత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పరీక్షల వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.
సోనమ్ వాంగ్చుక్ విడుదల చేసిన వీడియోలో, నీట్ పేపర్ లీకేజీ అంశంపై పార్లమెంట్‌లో చర్చ నిర్వహిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. శాంతియుతంగా ఆందోళనల్లో పాల్గొన్న విద్యార్థులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని, పేపర్ లీక్ ఘటనల నేపథ్యంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు 3

# నీట్ నిరసనల్లో అరాచక శక్తుల ప్రమేయం ఉంది: కేంద్ర మంత్రి బండి సంజయ్

### పోలీసులు, జర్నలిస్టులపై దాడులు జరిగాయి -- విపక్షాలు రాజకీయ లబ్ధికోసమే ఆరోపణలు చేస్తున్నాయి



న్యూఢిల్లీ, జూలై 24:
దేశవ్యాప్తంగా నీట్ పరీక్షల అంశంపై జరుగుతున్న నిరసనలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. విద్యార్థుల ఉద్యమం పేరుతో కొన్ని అరాచక, సంఘవిద్రోహ శక్తులు ఉద్యమంలో చొరబడి హింసాత్మక ఘటనలకు పాల్పడ్డాయని ఆయన ఆరోపించారు. శాంతియుతంగా సాగాల్సిన నిరసనలను కొందరు ఉద్దేశపూర్వకంగా హింసాత్మకంగా మార్చేందుకు ప్రయత్నించారని విమర్శించారు.
నిరసనల సందర్భంగా విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిపై, వార్తలను కవర్ చేస్తున్న జర్నలిస్టులపై కూడా దాడులు జరిగాయని బండి సంజయ్ తెలిపారు.
ఈ ఘటనల్లో మొత్తం 118 మంది పోలీసు సిబ్బంది గాయపడ్డారని పేర్కొన్నారు. 2

# ఇందిరా పార్క్ వద్ద బీఆర్ఎస్--కాంగ్రెస్ పోటాపోటీ ఆందోళనలు

### హైటెన్షన్.. భారీ పోలీసు బందోబస్తు.. ఇరు పార్టీల మధ్య తీవ్ర రాజకీయ వేడి




హైదరాబాద్, జూలై 24:
రాజధాని హైదరాబాద్‌లో శుక్రవారం రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో ఇందిరా పార్క్ ధర్నా చౌక్ ప్రాంతం తీవ్ర ఉద్రిక్తతకు కేంద్రంగా మారింది. ఇరు పార్టీల నేతలు ఒకేసారి ఆందోళనలకు సిద్ధం కావడంతో పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదుపులో ఉంచేందుకు చర్యలు చేపట్టారు.
ఢిల్లీలో నీట్ పరీక్షల అక్రమాలు, విద్యార్థుల ఆందోళనలపై జరిగిన పోలీసుల లాఠీచార్జిని నిరసిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర 2

# జనావాసాల మధ్యే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి

### క్యూర్ పరిధిలో ప్రభుత్వ ఖాళీ స్థలాల గుర్తింపునకు అధికారులకు ఆదేశాలు

హైదరాబాద్, జూలై 24:
హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియా (క్యూర్) పరిధిలో నిర్మించనున్న ఇందిరమ్మ ఇండ్లు జనావాసాలకు సమీపంలోనే ఉండేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపల వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన నిరుపయోగ స్థలాలను గుర్తించి, వాటిని గృహ నిర్మాణానికి వినియోగించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.
క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో గుర్తించిన ప్రభుత్వ స్థలాల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు.
పోలీస్, రెవెన్యూ, రవాణా తదితర శాఖలకు చెందిన వినియోగంలో లేని స్థలాలను గృహ నిర్మాణానికి తీసుకుని, ఆయా శాఖలకు అవసరమైన ప్రత్యామ్నాయ స్థలాలను వేరే చోట కేటాయించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ భూములను సమర్థవంతంగా వినియోగిస్తూ పేదలకు గృహాలు అందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.
జనావాసాలకు దూరంగా ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని, అలాంటి కాలనీలు భవిష్యత్తులో నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజలు నివసించే ప్రాంతాలకు దగ్గరగా, రవాణా సౌకర్యాలు ఉన్న చోట్లే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని సూచించారు. దీంతో లబ్ధిదారులు జీవనోపాధిని కోల్పోకుండా సౌకర్యవంతంగా జీవించగలరని పేర్కొన్నారు.
క్యూర్ పరిధిలోని పలు నియోజకవర్గాల్లో



నిరుపేదలకు ఆధునిక సౌకర్యాలతో కూడిన ఇందిరమ్మ గృహాలను ప్రభుత్వం నిర్మించనుంది. ఒక్కో ఫ్లాట్ 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించబడుతుంది. ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం సుమారు రూ.11 లక్షలు కాగా, ఇందులో ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్ధిదారుడు భరించాల్సి ఉంటుంది. భూమికి సంబంధించిన మొత్తం 2

# హైడ్రాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

### కమిషనర్ ఏ.వీ. రంగనాథ్‌కు వ్యక్తిగత హాజరు ఆదేశం -- కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనపై వివరణ కోరిన న్యాయస్థానం




హైదరాబాద్, జూలై 24:
తెలంగాణ హైడ్రా (న్ణ=ూూా) కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ వ్యవహారశైలిపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా చర్యలు చేపడుతున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ నెల 27న వ్యక్తిగతంగా కోర్టు ఎదుట హాజరుకావాలని న్యాయస్థానం ఆదేశించినట్లు సమాచారం. ఈ సందర్భంగా హైడ్రా అధికార పరిధి, విధులు, కోర్టు ఆదేశాల అమలు తీరుపై న్యాయస్థానం పలు కీలక ప్రశ్నలు లేవనెత్తినట్లు 2

తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



# కమిషనర్ ను నియమించండి.. మొక్కలు నాటుదాం: వైద్యుల వినూత్న నిరసన

**- రెండు నెలలుగా ఖాళీగా ఉన్న వైద్య విధాన పరిషత్ కమిషనర్ పదవి**

**- ఆస్పత్రుల ఆవరణలో మొక్కలు నాటుతూ నిరసన తెలిపిన వైద్య విధాన పరిషత్ జేఏసీ**



ఆర్మూర్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, ఆస్పత్రుల పర్యవేక్షణకు తక్షణమే రెగ్యులర్ కమిషనర్ ను నియమించాలని కోరుతూ తెలంగాణ వైద్య విధాన పరిషత్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపుమేరకు శుక్రవారం వినూత్న నిరసన చేపట్టారు. 'పర్యావరణ పరిరక్షణకు మొక్కలు.. మా సమస్యల పరిష్కారానికి కమిషనర్ నియామకం' అనే నినాదంతో జిల్లాలోని ఆసుపత్రుల ఆవరణలో వైద్యులు, పారామెడికల్ సిబ్బంది విధులకు ఆటంకం కలగకుండా ఉమ్మడిగా మొక్కలు నాటారు.

రెండు నెలలుగా పర్యవేక్షణ కరువైంది:
ఈ సందర్భంగా ఆర్మూర్ ఆసుపత్రి వైద్యులు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 185 ఆసుపత్రులలో 4000 మంది సిబ్బందితో వైద్య విధాన పరిషత్ ప్రజలకు ఉచిత సేవలు అందిస్తోందన్నారు. గత కమిషనర్ పదవీ విరమణ చేసి రెండు నెలలు దాటుతున్నా కొత్త కమిషనర్ ను నియమించకపోవడంతో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, కాంట్రాక్ట్ సిబ్బంది వ్యక్తిగత, సర్వీసు సమస్యలు నిలిచిపోయాయన్నారు. అత్యవసర విధుల్లో ఉన్నందున రోడ్డెక్కి నిరసనలు చేయలేక ఇలా సున్నితంగా విజ్ఞప్తి చేస్తున్నామని, ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఆందోళనలను తీవ్రతరం చేస్తామన్నారు.

# నీట్ నిరసనల్లో అరాచక శక్తుల ప్రమేయం ఉంది: కేంద్ర మంత్రి బండి సంజయ్

ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కు అందరికీ ఉన్నప్పటికీ, హింసకు పాల్పడే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.
పార్లమెంట్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులకు కుట్ర జరిగిందని బండి సంజయ్ ఆరోపించారు. దేశ భద్రతకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన సంఘవిద్రోహులపైనే పోలీసులు లాఠీచార్జి చేశారని, అమాయక విద్యార్థులపై ఉద్దేశపూర్వకంగా బలప్రయోగం చేయలేదని అన్నారు. పరిస్థితులను అదుపులోకి తీసుకురావడానికే పోలీసులు చర్యలు చేపట్టారని వివరించారు.
ఈ ఘటనలను విపక్ష పార్టీలు కావాలనే రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తున్నాయని ఆయన విమర్శించారు. వాస్తవాలను పక్కనపెట్టి కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం మాత్రమే వారి లక్ష్యంగా మారిందని అన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు.
సోషల్ మీడియా వేదికగా విదేశాల నుంచి, ముఖ్యంగా పాకిస్తాన్ నుంచి దేశానికి వ్యతిరేకంగా విషప్రచారం జరుగుతోందని బండి సంజయ్ పేర్కొన్నారు. భారతదేశంలో అస్థిరత సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అలాంటి ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని సూచించారు.
నీట్ పరీక్షల పేపర్ లీకేజీ అంశాన్ని కూడా రాజకీయంగా ఉపయోగించుకుంటున్నారని ఆయన అన్నారు. యూపీఏ ప్రభుత్వ హయాంలోనే సుమారు 70 సార్లు వివిధ పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయిన ఘటనలు నమోదయ్యాయని గుర్తు చేశారు. పేపర్ లీకేజీ సమస్య ఒక్క రాష్ట్రానికే పరిమితం కాదని, గతంలో దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు.
ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు, పేపర్ లీకేజీలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటోందని బండి సంజయ్ తెలిపారు. పరీక్షల వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి అవసరమైన చట్టపరమైన, పరిపాలనా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.
నీట్ నిరసనల పేరుతో హింసను ప్రోత్సహించే వారిపై చట్టం తన పని తాను చేస్తుందని ఆయన హెచ్చరించారు.

# జనావాసాల మధ్యే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలి

వ్యయాన్ని మాత్రం ప్రభుత్వమే భరిస్తుంది.
తొలి దశలో 17 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 7,680 ఫ్లాట్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఈ గృహాలను నిర్మించనున్నారు.
ఈ నియోజకవర్గాల పరిధిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా గృహ నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ కార్యక్రమం ద్వారా పట్టణ ప్రాంతాల్లో వేలాది నిరుపేద కుటుంబాలకు శాశ్వత నివాసం కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

# గోదావరి తీరంలో 99 లక్షల మొక్కల పెంపకం



బాసర, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి క్షేత్రంలో గోదావరి నది తీరం నుండి మహారాష్ట్ర త్రయంబకేశ్వర్ వరకు నదీ పరివాహక ప్రాంతంలో 99 లక్షల మొక్కలు నాటబోతున్నట్లు గ్రీన్ ఇండియా ఛాలెంజ్ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ అశోక్, బీఆర్ఎస్ నాయకుడు జాన్ సత్య తెలిపారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదినం సందర్భంగా జోగినపల్లి సంతోష్ కుమార్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రానున్న ఐదేళ్లలో వంద కోట్ల మొక్కలు నాటే లక్ష్యంతో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ముందుకు సాగుతోందన్నారు. శనివారం బాసరలో ప్రారంభమయ్యే ఈ ప్లాంటేషన్ డ్రైవ్‌లో జిల్లాలోని పర్యావరణ ప్రేమికులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

# కూచిపూడి నృత్యంలో ప్రతిభ చాటిన లౌఖ్య



తానూర్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తిరుపతి మహతి కళాక్షేత్రంలో అభినవ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 26వ జాతీయ స్థాయి నృత్య పోటీల్లో తానూర్ కు చెందిన చిన్నారి బి. లౌఖ్య అద్భుత ప్రతిభ కనబరిచింది. భైంసా డాన్స్ స్కూల్ లో శిక్షణ పొందుతున్న లౌఖ్య జాతీయ వేదికపై కూచిపూడి, భరతనాట్యం విభాగాల్లో ప్రదర్శించిన నృత్య విన్యాసాలకు న్యాయనిర్ణేతలు ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు.
ప్రస్తుతం తానూర్ వాగ్దేవి విద్యానికేతన్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న లౌఖ్య జాతీయ స్థాయిలో ప్రతిభ చాటడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. లౌఖ్యను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# వ్యాస పూర్ణిమ ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

భైంసా/బాసర, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఈ నెల జూలై 29న నిర్వహించనున్న వ్యాస పూర్ణిమ (గురుపౌర్ణమి) మూడు రోజుల ముక్కోటి ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ భైంసాలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ను బాసర ఆలయ ఈఓ అంజనీ దేవి, వేద పండితులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.
ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ పనులు, ఉత్సవాల్లో భక్తులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలపై ఎమ్మెల్యే ఈఓతో చర్చించారు. అనంతరం వేద పండితులు మంత్రోచ్చారణలతో ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



# రేషన్ కార్డుదారులకు అలర్ట్!

## ఈ-కేవైసీకి మరో ఏడు రోజులే గడువు!

## గడువు దాటితే రేషన్ కట్ అయ్యే ప్రమాదం




నిర్మల్ జూలై 24 తెలంగాణ వెన్నెల వాక్కు
పౌర సరఫరాల శాఖ రేషన్ కార్డు లబ్ధిదారులకు కీలకమైన ప్రకటన జారీ చేసింది. రేషన్ కార్డుల్లో నమోదైన సభ్యులందరూ ఈ నెలాఖరు నాటికి తప్పనిసరిగా ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ గడువు ముగియడానికి ఇంకా కేవలం ఏడు రోజులు మాత్రమే సమయం ఉండటంతో, జిల్లాల వారీగా అధికారులు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. గడువు దాటితే వచ్చే నెల నుంచి రేషన్ సరుకులు నిలిచిపోయే ప్రమాదం ఉందని అధికారులు స్పష్టంగా హెచ్చరిస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాలో భారీగా పెండింగ్ కేవైసీలు**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని గణాంకాలను పరిశీలిస్తే, అక్కడ మొత్తం 7,59,238 రేషన్ కార్డులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఒక్క నిర్మల్ జిల్లా పరిధిలోనే 2,08,487 రేషన్ కార్డులు నమోదై ఉన్నాయి. అయితే 2024 సంవత్సరం ప్రారంభంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సుమారు 30 శాతం మంది రేషన్ కార్డుదారులు ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయలేదని అధికారులు వెల్లడించారు. ఈ బకాయిలను అధిగమించడానికి నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి, మిగిలిన లబ్ధిదారులందరితో ఈ ఏడు రోజుల వ్యవధిలోనే లక్ష్యాన్ని పూర్తి చేయించేందుకు క్షేత్రస్థాయిలో ముమ్మర చర్యలు చేపట్టారు.

**అనర్హుల ఏరివేతకే ప్రభుత్వం ప్రాధాన్యం**

ఈ-కేవైసీ ప్రక్రియ వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం అనర్హులను ఏరివేయడమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. పారదర్శకమైన వ్యవస్థను రూపొందించేందుకు, నిజమైన నిరుపేదలకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చూసేందుకు ఈ బయోమెట్రిక్ సరిచూసే విధానం ఎంతగానో దోహదపడుతుంది. కార్డుల్లో పేర్లు ఉండి ఏళ్లుగా రేషన్ తీసుకోని వారిని, మరణించిన వారిని, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన వారిని, అలాగే నకిలీ పేర్లను తొలగించేందుకు ఈ కసరత్తు ఉపయోగపడుతుంది. కార్డులో పేరున్న ప్రతి ఒక్క సభ్యుడు స్థానిక రేషన్ దుకాణాల్లోని ఈ-పోస్ యంత్రాల ద్వారా తమ వేలిముద్రలు వేసి ఈ-కేవైసీని పూర్తి చేయాల్సి ఉంటుంది.

**ప్రత్యేక క్యాంపులతో వేగవంతమైన చర్యలు**

ఈ సందర్భంగా జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు మాట్లాడుతూ, రేషన్ కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తక్షణమే ఈ-కేవైసీ పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. గడువు సమీపిస్తున్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్రామాలు, వార్డుల వారీగా ప్రత్యేక క్యాంపులను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మరోసారి గడువు పొడిగించే ఆలోచన లేనందున, ప్రజలు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే తమ సమీప రేషన్ దుకాణాలకు వెళ్లి ప్రక్రియను ముగించుకోవాలని సూచించారు.

**లబ్ధిదారులకు ఒకేసారి 3 నెలల సన్న బియ్యం**

మరొకవైపు నిర్మల్ జిల్లాలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు అధికారులు తీపి కబురు అందించారు. రాబోయే రోజుల్లో లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల రేషన్ కింద సన్న బియ్యాన్ని పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా బియ్యాన్ని సరఫరా చేస్తూ, ప్రతి లబ్ధిదారునికి సకాలంలో, పారదర్శకంగా రేషన్ అందేలా ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నారు. రేషన్ పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరిగిన సహించేది లేదని, ఎవరైనా డీలర్లు అదనపు వసూళ్లకు పాల్పడినా లేదా ఇతరత్రా సమస్యలు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులు ప్రజలకు స్పష్టం చేశారు. ఈ విధంగా నిర్మల్ జిల్లా యంత్రాంగం ఒకవైపు ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేస్తూనే, మరోవైపు అర్హులైన ప్రజలకు బియ్యం పంపిణీ సరళంగా జరిగేలా చర్యలు తీసుకుంటోంది. లబ్ధిదారులు ఈ ఏడు రోజుల అవకాశాన్ని వదులుకోకుండా త్వరపడాలి.

# విద్యాసంస్థల్లో డ్రగ్స్ ఘటనలకు యాజమాన్యాలదే బాధ్యత

ఫిర్యాదు చేసే విధంగా వ్యవస్థను రూపొందించాలని చెప్పారు.
డ్రగ్స్ సమస్యను ఎదుర్కోవడంలో మూడు దశల్లో చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలను గుర్తించడం, మాదకద్రవ్యాల వినియోగదారులను ఆ అలవాటు నుంచి బయటపడేలా డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపించి కౌన్సెలింగ్ ఇవ్వడం, పదేపదే నేరాలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు.
ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి. సుదర్శన్ రెడ్డి, కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ఈగల్ విభాగం డైరెక్టర్ సందీప్ శాండిల్యతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
రాష్ట్రంలో



# విరలేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు



.తానూర్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తానూర్ మండల కేంద్రంలోని చారిత్రాత్మక విరలేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల జూలై 30వ తేదీ నుండి నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. ప్రతిరోజూ రాత్రి వేళల్లో స్వామివారికి అభిషేకాలు, హారతులు ఉంటాయన్నారు.
శనివారాల్లో హనుమాన్ ఆలయ సేవ, సోమవారాల్లో ఏనుగు వాహన సేవ, బుధవారాల్లో పల్లకీ సేవలు నిర్వహిస్తామన్నారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ కోరింది.

# బడుల విద్యార్థుల యూనిఫామ్ ల తయారీ వెంటనే పూర్తి చేయాలి

## – అన్ని జిల్లాల కలెక్టర్లతో వీసీ ద్వారా మాట్లాడిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి
## – ప్రతి మండలంలో ఈనెల జూలై 27, 28, 29 తేదీల్లో రైతులకు విత్తన మేళాల నిర్వహణ




నిర్మల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందించే స్కూల్ యూనిఫామ్ ల తయారీ ప్రక్రియను తక్షణమే పూర్తి చేసి పిల్లలకు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఉన్నతాధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం హైదరాబాద్ నుండి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో స్కూల్ యూనిఫామ్స్ తయారీ, రాష్ట్రవ్యాప్తంగా వాతావరణ పరిస్థితులు, పంటల సాగు మరియు భూగర్భ జలాల పెంపుదలపై ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాల వారీగా కుట్టు పనుల ప్రగతిని ఆరా తీసిన సీఎస్, తయారైన దుస్తులను వెంటనే పాఠశాలలకు చేర్చాలన్నారు.
భూగర్భ జలాల పెంపునకు జలసిరి పనులు వేగవంతం:
రాష్ట్రంలో ఎల్ నినో పరిస్థితులను తట్టుకునేలా భూగర్భ జలాల సంరక్షణకు తెలంగాణ జలసిరి పనులను వేగవంతం చేయాలని సీఎస్ స్పష్టం చేశారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రతి మండలంలో ఈనెల జూలై 27, 28, 29 తేదీలలో విత్తన మేళాలు నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ నుండి వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, జిల్లాలో పెద్ద ఎత్తున ఫామ్ పాండ్ ల నిర్మాణాలకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. సమీక్షలో డీఆర్డీఓ విజయలక్ష్మి, డీఈఓ భోజన్న, డీఎంహెచ్ఓ రాజేందర్, సీపీఓ గంగారెడ్డి పాల్గొన్నారు.

# కళాశాలలో యాంటీ డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



భైంసా, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
భైంసా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల నిరోధం (యాంటీ డ్రగ్స్) మరియు సైబర్ నేరాలపై ప్రత్యేక అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ బుచ్చయ్య అధ్యక్షతన జరిగిన సదస్సుకు భైంసా ఎస్సై పి. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.
యువత చెడు వ్యసనాలకు, డ్రగ్స్ కు దూరంగా ఉండాలని ఎస్సై పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో అపరిచిత లింకులను క్లిక్ చేయవద్దని, సైబర్ మోసం జరిగితే వెంటనే పోలీసులను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ సంతోష్ కుమార్, రవికుమార్, భీమారావు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీకి మోడీ బాధ్యత వహించాలి: బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్




నిర్మల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
దేశంలో సంచలనం సృష్టించిన నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ డిమాండ్ చేశారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి, రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ పిలుపు మేరకు శుక్రవారం నిర్మల్ ట్యాంక్ బండ్ వద్ద గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద బీఎస్పీ శ్రేణులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా జగన్ మోహన్ మాట్లాడారు.
భాజపా పాలనలో 152 సార్లు పేపర్ లీకేజీలు:
దేశంలో భాజపా అధికారంలో ఉన్న 12 ఏళ్ల పాలనలో దాదాపు 152 రకాల పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీకై లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందన్నారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. చనిపోయిన 27 మంది విద్యార్థుల కుటుంబాలకు ప్రధాని కనీసం సానుభూతి తెలపకపోవడం దారుణమన్నారు. విద్యార్థులపై మోపిన అక్రమ కేసులను ఎత్తివేసి, బాధిత కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్ గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో పార్టీ నాయకులు లక్ష్మీ యాదవ్, రాజేశ్వర్, చెరుకురాజ్యం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ఆలయాల నిర్వహణలో ప్రభుత్వ జోక్యం?

## రాజ్యాంగ స్ఫూర్తికి గొడ్డలి పెట్టు!

### రాజ్యమా.. రాచరికమా?.. మత విశ్వాసాలు, ఆలయ స్వయంప్రతిపత్తిపై వెయ్యేళ్లనాటి పాఠాలు



భారతదేశం తనను తాను అధికారికంగా లౌకిక రాజ్యంగా ప్రకటించుకోవడానికి శతాబ్దాల ముందే, ఆధ్యాత్మిక రంగాన్ని మరియు రాజకీయాధికారాన్ని స్పష్టంగా వేర్వేరుగా ఉంచే అద్భుతమైన ప్రజాస్వామ్య సూత్రాన్ని అనుసరించింది. స్వతంత్ర భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన మొదటి పాతికేళ్ల వరకు 'లౌకిక' అనే పదాన్ని ప్రత్యక్షంగా రాజ్యాంగ ప్రవేశికలో చేర్చకపోయినప్పటికీ, ఆర్టికల్ 25 మరియు 26ల ద్వారా ప్రతి మతశాఖకు తమ స్వంత మతపరమైన వ్యవహారాలను తామే స్వతంత్రంగా నిర్వహించుకునే ప్రాథమిక హక్కును అత్యున్నత రక్షణగా కల్పించింది. అయితే, ఎమర్జెన్సీ కాలంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగంలోకి ఈ పదాన్ని ప్రవేశపెట్టిన నాటి నుండి, వ్యవస్థలో ఒక దురదృష్టకరమైన విపరిణామం చోటుచేసుకుంది. రాజ్యానికి ఉండాల్సిన ఈ లౌకిక స్ఫూర్తి క్రమంగా మసకబారిపోతూ, ప్రభుత్వాలు తమ పరిధిని దాటి మత సంస్థలకు స్వయంప్రకటిత సంరక్షకులుగా, సర్వాధికారులుగా రూపాంతరం చెందాయి. అధికారుల నియంత్రణ అనేది కాలక్రమేణా ప్రత్యక్ష పాలనగా రూపాంతరం చెందింది. చట్టాలు, శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన ప్రభుత్వం, చివరకు ఆలయాల రోజువారీ కార్యకలాపాలను నడిపే ఒక కార్పొరేట్ మేనేజర్ స్థాయికి దిగజారిపోవడం లౌకికవాదానికే పెద్ద మచ్చగా మారింది.
అసలు ఆధునిక లౌకికవాదంపై పాశ్చాత్య దేశాల్లో చర్చలు ప్రారంభం కాకముందే, వెయ్యేళ్ల క్రితం నాటి చోళుల తమిళ శాసనాలు దేవాలయ నిర్వహణలో అద్భుతమైన ప్రజాస్వామ్య, పౌర వ్యవస్థను చాటిచెప్పాయి. ప్రజా నిధుల వినియోగం, విద్యాలయాలకు నిధులు, పన్నుల లెక్కలు మరియు నిధుల దుర్వినియోగానికి విధించే తీవ్రమైన జరిమానాల వరకు చోళులు పారదర్శకమైన కమిటీల ద్వారా ఎన్నికలు నిర్వహించి ఆలయాలను నడిపారే తప్ప, రాజులు ఎన్నడూ రాజ్యాధికారాన్ని ఆలయ పాలనపై రుద్దలేదు. ఆలయం అనేది కేవలం భక్తి ప్రార్థనలకు మాత్రమే పరిమితం కాకుండా, సమాజానికి ఖజానాగా, నైతిక కేంద్రంగా, విద్యానిలయంగా వెలిగింది. నాటి పాలకులు ఆలయాలకు రక్షణ ఇచ్చారు, నిధులు సమకూర్చారు తప్ప వాటి ఆధ్యాత్మిక, నిర్వహణా స్వేచ్ఛను హరించలేదు. రాజులు సైతం ఆలయాల నిధులను తమ సొంత అవసరాలకు లేదా రాజ్య విస్తరణకు వాడుకోవడానికి భయపడేవారంటే, నాటి ఆలయ వ్యవస్థకు ఉన్న స్వయంప్రతిపత్తి ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు.
కానీ ఈ సనాతన స్వేచ్ఛను బ్యూరోక్రసీ బంధీఖానాలో బంధించే కుట్ర ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనతో మొదలైంది. 1817 నాటి రెగ్యులేషన్ ఎ×× చట్టం ద్వారా నాటి వలస పాలకులు నిధుల దుర్వినియోగాన్ని అరికడతామనే నెపంతో ఆలయాల ఆస్తులను, ఆదాయాలను ప్రభుత్వ పర్యవేక్షణలోకి లాక్కున్నారు. బ్రిటిష్ వారు భారతీయ సమాజం యొక్క సాంస్కృతిక ములాలు దెబ్బతీయడానికి, ఆలయాల ఆధారంగా నడిచే విద్య, ఆర్థిక వ్యవస్థలను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి ఈ కుట్ర పన్నారు. విచారకరమైన విషయమేమిటంటే, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా నాటి దాస్య శృంఖలాలను తెంచుకోకుండా, అదే బ్రిటిష్ వలసవాద విధానాలను నేటి 'హిందూ మత మరియు ధర్మాదాయ చట్టాల' రూపంలో మన స్వదేశీ ప్రభుత్వాలు కొనసాగించడం. మసీదులు, చర్చ్‌లకు లేని ఈ రకమైన తీవ్రమైన ప్రభుత్వ జోక్యం, బ్యూరోక్రసీ ఆధిపత్యం కేవలం హిందూ ఆలయాలపైనే చట్టబద్ధంగా చెల్లుబాటు కావడం రాజ్యాంగపరమైన వివక్ష కాక మరేమిటి?
ఆర్థిక అవకతవకలు జరిగాయనే సాకుతో ప్రభుత్వాలు మత సంస్థల నిర్వహణను తమ చేతుల్లోకి తీసుకోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. ప్రభుత్వ పరిపాలనలో ఎన్నో శాఖల్లో నిత్యం అవినీతి, అవకతవకలు జరుగుతూనే ఉంటాయి, అంతమాత్రాన ఆయా వ్యవస్థలను మూసివేయడం లేదు కదా! అలాగే, ఆలయాల్లో అవినీతికి అసలైన పరిష్కారం బ్యూరోక్రటిక్ రాజ్యాన్ని పెంచడం, అధికారులకు పదవులు కట్టబెట్టడం కాదు. స్వతంత్ర ఆడిటింగ్ వ్యవస్థలు, డిజిటల్ పద్ధతిలో బహిరంగ లెక్కలు మరియు త్వరితగతిన శిక్షలు పడేలా కఠిన జవాబుదారీతనాన్ని తీసుకురావడమే అసలైన పరిష్కారం. ఒక ప్రభుత్వ అధికారి వెళ్లినంత మాత్రాన ఏ సంస్థలోనూ రాత్రికి రాత్రే పారదర్శకత వచ్చేయదు. పైగా, అధికారుల జోక్యం వల్ల ఆలయాల ఆధ్యాత్మికత దెబ్బతిని, అవి కేవలం ఆదాయాన్ని సమకూర్చే వ్యాపార కేంద్రాలుగా మారిపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
ఒక నిజమైన లౌకిక రాజ్యం బాధ్యత చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడం, మోసాలను నిర్దాక్షిణ్యంగా శిక్షించడం, వివాదాలను తటస్థంగా పరిష్కరించడమే తప్ప, పూజారుల పక్కన కూర్చుని ఆలయ మేనేజ్‌మెంట్ చేయడం కానే కాదు. రాజ్యాంగం ఇచ్చిన హక్కుల ప్రకారం ఆలయాల నిర్వహణా స్వేచ్ఛను, పారదర్శకమైన పద్ధతిలో తిరిగి భక్తులకు, ఆయా సమాజాలకే తక్షణమే అప్పగించాల్సిన రాజ్యాంగబద్ధ అవసరం ఉంది. ప్రభుత్వం తన పరిధి ఏంటో తెలుసుకుని ప్రార్థనా మందిరాల నిర్వహణ నుంచి బయటకు వచ్చినప్పుడే భారతదేశంలో నిజమైన లౌకికవాదం, ప్రజాస్వామ్య స్ఫూర్తి వర్ధిల్లుతాయి.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# విద్యాసంస్థల బంద్ కు విశేష స్పందన: ఎన్ఎస్‌యూఐ

ముధోల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు):
విద్యార్థుల హక్కుల పరిరక్షణ కొరకు ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం పిలుపునిచ్చిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ కు ముధోల్ నియోజకవర్గంలో విశేష స్పందన లభించిందని ఎన్ఎస్‌యూఐ జిల్లా నాయకులు తెలిపారు. బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించిన యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.
కేంద్రంలో జాతీయ స్థాయి పరీక్షల లీకేజీలపై ప్రభుత్వం స్పందించి పారదర్శకత తీసుకురావాలన్నారు. ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన దాడులకు కేంద్రం క్షమాపణ చెప్పాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు పోరాటం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు అంజాద్ షేక్, ప్రతీక్, శశి కుమార్ పాల్గొన్నారు.



# 26 రోజుల నిరాహార దీక్ష విరమించిన సోనమ్ వాంగ్చుక్

తగిన సహాయం అందిస్తామని కూడా కేంద్రం లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినట్లు వెల్లడించారు.
పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ప్రధాని మోదీ తెలిపారు. లీకేజీలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసే ప్రత్యేక బిల్లును త్వరలోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదింపజేస్తామని స్పష్టం చేశారు.
అయితే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని నిరసనకారులు ప్రకటించారు. మరోవైపు, ప్రధాని మోదీ వ్యాఖ్యలపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందిస్తూ, యువతకు క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో నీట్ పేపర్ లీకేజీ అంశం పార్లమెంట్‌లోనూ దుమారం రేపింది. విపక్ష సభ్యుల నిరసనలతో వర్షాకాల సమావేశాలు వరుసగా నాలుగో రోజు కూడా అంతరాయానికి గురయ్యాయి. ప్రభుత్వం--విపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం కొనసాగుతుండగా, పరీక్షల సంస్కరణలు, పేపర్ లీకేజీ నిరోధక చర్యలపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది.

# అక్రమ సంబంధం.. 6 లక్షల సుపారీ..

## ఆటో డ్రైవర్ దారుణ హత్య!

### - సుపారీ గ్యాంగ్ తో హత్య చేయించిన సవతి తల్లి అన్వరీ బేగం
### - కేసును ఛేదించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసిన నిర్మల్ పోలీసులు




నిర్మల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలో ఇటీవల జరిగిన ఆటో డ్రైవర్ అస్లాం ఖాన్ హత్య కేసును జిల్లా పోలీసులు అత్యంత వేగంగా ఛేదించారు. కుటుంబ విభేదాలు, అక్రమ సంబంధం, పరువు భయం, కక్షల నేపథ్యంలో ఈ హత్యకు పక్కా ప్రణాళిక రూపొందించి, మహారాష్ట్రకు చెందిన అంతర్రాష్ట్ర సుపారీ గ్యాంగ్‌తో రూ.6 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుని హత్య చేయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందాలు చేపట్టిన దర్యాప్తులో ప్రధాన కుట్రదారు సహా నిందితులను అరెస్ట్ చేసి కేసును ఛేదించారు.

**మహారాష్ట్ర గ్యాంగ్ కు రూ.6 లక్షల సుపారీ:**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మృతుడు అస్లాం ఖాన్‌కు తన సవతి తల్లి అన్వరీ బేగంతో అక్రమ సంబంధం ఉంది. ఈ సంబంధాన్ని ముగించి వేరొక యువతిని వివాహం చేసుకోవాలని అస్లాం ఖాన్ నిర్ణయించుకున్నాడు. దీనిని వ్యతిరేకించిన అన్వరీ బేగం, అక్రమ సంబంధం బయటపడి పరువు పోయిందనే ఆగ్రహంతో మహారాష్ట్రకు చెందిన ముఖీద్‌కు రూ.6 లక్షల సుపారీ ఇచ్చింది. జూలై 15న తెల్లవారుజామున మహారాష్ట్ర నుండి స్కార్పియో వాహనంలో వచ్చి వైఎస్సార్ కాలనీ వద్ద ఆటోను అడ్డగించి అస్లాం ఖాన్ ను కత్తులతో దారుణంగా నరికి చంపారు. ప్రధాన కుట్రదారు అన్వరీ బేగంతో పాటు ముఖీద్, అఫ్రోజ్, షేక్ షాహిద్, సాయినాథ్ పవార్, షేక్ మహమ్మద్‌లను అరెస్ట్ చేసి స్కార్పియో, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు.

## బన్సపల్లిలో పోలీసులు-డీఎస్పీ శ్రీనివాస్ పర్యటన



దిలావర్‌పూర్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండలం బన్సపల్లి గ్రామ శివారులో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నారన్న సమాచారంతో నిర్మల్ పోలీసులు వెంటనే స్పందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ శుక్రవారం బన్సపల్లి గ్రామాన్ని సందర్శించి సర్పంచ్, గ్రామ పెద్దలతో మాట్లాడి పరిస్థితులను సమీక్షించారు.

గ్రామంలో ఎలాంటి చోరీలు లేదా నేరాలు జరగలేదని డీఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలు అసత్య పుకార్లను నమ్మవద్దని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామంలో భద్రత కొరకు పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని నిరంతరం గస్తీ కాయాలని ఆదేశించారు.

## ఓటర్ల సమగ్ర సవరణను పరిశీలించిన శ్రీహరి రావు



నిర్మల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని ఆగ్రా కాలనీ, ఇందిరానగర్, ద్యాగవాడ, ప్రియదర్శిని నగర్ ప్రాంతాల్లో సాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

బీఎల్‌ఓలతో మాట్లాడి దరఖాస్తుల వివరాలను ఆరా తీశారు.

అర్హత ఉన్న ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేయాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లో పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజేందర్, రమేష్, శేఖర్, కిరణ్, అన్వార్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత ముథోల్ కు వ్యాపారులు సహకరించాలి



ముథోల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): పరిసరాల పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని ముథోల్ గ్రామ పంచాయతీ ఈవో అన్వర్ అలీ కోరారు. శుక్రవారం ఆయన ముథోల్ లోని పలు వ్యాపార దుకాణాలను సందర్శించి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలపై వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్ల వల్ల భూమి కాలుష్యంతో పాటు పశువుల ప్రాణాలకు ముప్పు ఉందన్నారు. ప్లాస్టిక్ సంచుల బదులుగా గుడ్డ సంచులు, జూట్ బ్యాగులను వినియోగించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత ముథోల్ నిర్మాణానికి అందరూ సహకరించాలన్నారు.

## ముథోల్ సామాజిక ఆసుపత్రిలోనే గైనకాలజిస్ట్ ను కొనసాగించాలి



ముథోల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముథోల్ సామాజిక ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న గైనకాలజిస్ట్ వైద్యాధికారిని బోథ్‌కు బదిలీ చేసే నిర్ణయాన్ని రద్దు చేసి ఇక్కడే కొనసాగించాలని ముథోల్ గ్రామసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. శుక్రవారం సర్పంచ్ షబానా బేగం అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో ఈ తీర్మానం చేశారు.

ముథోల్ తో పాటు బాసర, తానూర్ మండలాల నుండి నిత్యం వందలాది మంది గర్భిణులు ఇక్కడికి వస్తుంటారని, డాక్టర్ ను బదిలీ చేస్తే మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడతారన్నారు. బదిలీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సబ్ కలెక్టర్ కు, డీసీహెచ్‌ఓకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

## వ్యాస పూర్ణిమ వేడుకలకు ఎస్పీకి ఆలయ అధికారుల ఆహ్వానం



బాసర, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల జూలై 27 నుండి 29 వరకు అత్యంత వైభవంగా నిర్వహించనున్న వ్యాస పూర్ణిమ ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ ఈఓ అంజనీ దేవి, స్థానాచార్యులు ప్రవీణ్ పాఠక్ నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిలను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి వేదాశీర్వచనాలతో ఉత్సవాల అధికారిక ఆహ్వాన పత్రికను అందజేశారు. ఉత్సవాల విశిష్టతను వివరించి అమ్మవారి దర్శనానికి రావాల్సిందిగా కోరారు. ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించిన ఎస్పీ ఆలయ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

## గుండంపల్లిలో ఫ్రైడే-డ్రైడే పారిశుధ్య కార్యక్రమం



దిలావర్‌పూర్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): దిలావర్‌పూర్ మండల కేంద్రంతో పాటు గుండంపల్లి గ్రామంలో శుక్రవారం అధికారికంగా 'ఫ్రైడే-డ్రైడే' పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పంచాయతీ అధికారి గోవర్ధన్, కార్యదర్శి మహేందర్ ఆరోగ్య సిబ్బందితో కలిసి వీధుల్లో పర్యటించారు. ఇళ్ల ప్రాంగణాల్లో పాత టైర్లు, కుండల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా డ్రైనేజీల్లో బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు చంద్రభాగ, పుష్ప, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్: ప్రయాణికుడి బంగారు గొలుసు అప్పగింత!



నిర్మల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం, సుఖప్రదమే కాదు... ఆర్టీసీ సిబ్బంది నిజాయితీకి నిలువెత్తు రూపమని నిర్మల్ డిపో డ్రైవర్ జి. రమేష్ నిరూపించారు. ఆర్టీసీ నిర్మల్ డిపోకు చెందిన బస్సు నిర్మల్ నుండి ఒంగోలు వెళ్తుండగా, జగిత్యాల జిల్లా కలికోట గ్రామానికి చెందిన దూలం గంగాధర్ అనే ప్రయాణికుడు జగిత్యాలలో బస్సు ఎక్కి విజయవాడలో దిగిపోయాడు. అయితే నిద్రమత్తులో తన మెడలోని 10 గ్రాముల తులానికి పైగా ఉన్న బంగారు గొలుసును బెర్త్ సీటుపైనే జారవిడుచుకున్నాడు.

**ఫోన్ నంబర్ ఆధారంగా పిలిపించి చైన్ అందజేత:**

బస్సు ఒంగోలు డిపోకు చేరుకున్న అనంతరం డ్రైవర్ రమేష్ బస్సును శుభ్రం చేస్తూ చెక్ చేయగా, బెర్త్ సీటుపై బంగారు గొలుసు కనిపించింది. వెంటనే ఆయన డిపో అధికారులకు సమాచారం అందించారు. రిజర్వేషన్ చార్ట్ లోని ఫోన్ నంబర్ ఆధారంగా తిరుగు ప్రయాణంలో విజయవాడ బస్టాండ్‌కు బాధితుడు గంగాధర్ ను పిలిపించి విజయవాడ స్టేషన్ మేనేజర్ సమక్షంలో బంగారు గొలుసును సురక్షితంగా అందజేశారు. డ్రైవర్ రమేష్, పెంబి జమీల్ లను నిర్మల్ డిపో మేనేజర్ కేపీ పండరి మరియు ప్రయాణికులు ఘనంగా అభినందించారు.

## 'మేము సగం- మాకు సగం': బీసీ దళపతి డాక్టర్ పరికిపండ్ల అశోక్



నిర్మల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయ, సామాజిక రంగాల్లో సగం వాటా దక్కినప్పుడే దేశంలో సామాజిక న్యాయం సంపూర్ణమవుతుందని బీసీ దళపతి, కుల గణనకై దేశవ్యాప్త కోటి ఉత్తరాల ఉద్యమ రూపకర్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ పిలుపునిచ్చారు. శుక్రవారం నిర్మల్ పట్టణ కేంద్రంలోని ఆదర్శనగర్ పద్మశాలి కళ్యాణమండపంలో స్వదేశ్ పరికిపండ్ల అధ్యక్షతన జరిగిన ప్రత్యేక సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు దత్తాత్రేయతో కలిసి 'బీసీ మ్యానిఫెస్టో' పుస్తకాన్ని ఆవిష్కరించారు.

**అన్ని బీసీ కులాలు ఒకే తాటిపైకి రావాలి:**

ఈ సందర్భంగా డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ, అడవిలో తిరిగే పులులను, రోడ్డు పక్కన పెరిగే చెట్లను, పశువులను లెక్కిస్తున్న ప్రభుత్వాలు బీసీలను లెక్కించడానికి ఎందుకు భయపడుతున్నాయని ప్రశ్నించారు. బీసీల జనాభా లెక్క తేలితే రాజకీయంగా తమ ఉనికికి ప్రమాదమని ప్రధాన పార్టీలు భయపడుతున్నాయన్నారు. బీసీలలోని అన్ని కుల సంఘాలు ఐక్యంగా ఒకే తాటిపైకి వచ్చి హక్కుల సాధన కొరకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో కుర్ర నరేష్, సంతోష్, రమేష్, శేఖర్, ఇటిక్యాల నరేష్ పాల్గొన్నారు.

## ఆదర్శనగర్ వశిష్ట స్కూల్ లో 40 కోతుల పట్టివేత



నిర్మల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణ వాసులను, ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తున్న కోతుల సమస్య పరిష్కారానికి మున్సిపాలిటీ అధికారులు వినూత్న చర్యలు చేపట్టారు. శుక్రవారం నిర్మల్ పట్టణంలోని (వార్డు నెంబర్ 16) ఆదర్శనగర్ లో గల వశిష్ట హైస్కూల్ ప్రాంగణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి నేతృత్వంలో ప్రత్యేక కోతుల పట్టివేత కార్యక్రమం నిర్వహించారు.

కవ్వాల్ అటవీ ప్రాంతానికి తరలింపు:

ప్రత్యేక బోన్లు, వలల ద్వారా పాఠశాల ప్రాంగణంలో సంచరిస్తున్న సుమారు 40 కోతులను సిబ్బంది చాకచక్యంగా పట్టుకున్నారు. వాటికి గుర్తించేందుకు రంగులు చల్లి సురక్షితంగా కవ్వాల్ దట్టమైన అటవీ ప్రాంతానికి వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో కోతుల బెడద లేకుండా అన్ని వార్డుల్లో ఈ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రావులవార్ విట్టల్, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్, శ్రీనివాస్ గౌడ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## వామపక్షాల బంద్ సంపూర్ణ విజయవంతం: నామత్కర్ నవీన్




నిర్మల్, జూలై 24 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీపై శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్‌కు నిరసనగా వామపక్ష విద్యార్థి సంఘాల (యుఎస్ఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్ యు) పిలుపుమేరకు చేపట్టిన విద్యాసంస్థల బంద్ నిర్మల్ జిల్లాలో సంపూర్ణ విజయవంతమైందని యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామత్కర్ నవీన్ తెలిపారు. శుక్రవారం నిర్మల్ లోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలతో పాటు ప్రైవేట్ బడులు స్వచ్ఛందంగా మూతపడ్డాయి.

ఎన్టీఏ ఏజెన్సీని తక్షణమే రద్దు చేయాలని, విద్యార్థులపై లాఠీఛార్జ్ చేయించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌కు సహకరించిన యాజమాన్యాలు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com